క్లుప్తంగా


ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జూన్ 20 నుంచి 29వ తేదీ వరకు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం జరుగుతుందని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల నుంచి 650 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొంటారన్నారు. ఎన్‌సీసీ శిబిరం ఏర్పాట్ల పర్యవేక్షణకు ఎన్‌సీసీ నావెల్ యూనిట్ సూపరింటెండెంట్ ముకుంద్ సాగర్, ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మణ్‌కుమార్ కళాశాల విచ్చేశారు. వారు మాట్లాడుతూ ఎన్‌సీసీ ఆర్మీ, నావెల్‌వింగ్ శిక్షణ శిబిరం నిర్వహణకు సంబంధించి ఎన్‌బీకేఆర్ కళాశాలలో వసతులు ఉన్నాయన్నారు. జేఎన్‌టీయూ పరిధిలో ఎన్‌సీసీ శిక్షణకు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీని ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది బదిలీ

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు బదిలీపై వెళ్లారు. ఆర్‌ఐగా పనిచేస్తున్న ఐ.సుధీర్‌ను ముత్తుకూరు మండలానికి, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిరుమలరావు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

పోలేరమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

ఓజిలి: ఓజిలి గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు మంగళవారం పొంగళ్లు పెట్టారు. అమ్మవారిని ప్రతిష్ఠించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లతో నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి రైతులు సంతోషంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన


మాట్లాడుతున్న అధికారులు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఉన్న ఓ స్థలం విషయమై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈక్రమంలో భాగంగా మంగళవారం తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శివకుమార్, ఎస్‌ఐ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇరువర్గాల వారు స్థలానికి సంబంధించి అధికారులకు వివరించారు.

పశువైద్యాధికారికి సన్మానం


ప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సైదాపురం: మండల పశువైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ బొద్ద ప్రసాద్ బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా పశువైద్యశాల సిబ్బంది మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన సేవలను సిబ్బంది కొనియాడారు. రాపూరు మండలం పెనుబర్తి పశువైద్యశాలకు ప్రసాద్ బదిలీ అయ్యారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్


సారాసుబుద్ధి

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కర్పాడి సారా సుబుద్ధికి కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. నెల్లూరు వీఆర్ కళాశాలకు చెందిన విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్‌రావు పర్యవేక్షణలో రసాయన శాస్త్రంలో స్పెక్ట్రో ఫోటో మెట్రిక్ డిటర్మినేషన్ ఆఫ్ ట్రేస్ కాపర్ మెటల్ ఇన్ ఫార్మా ప్రొడక్ట్, వాటర్, వెజిటబుల్స్ అండ్ డిఫరెంట్ వెట్, డ్రై ఫుడ్ స్టఫ్స్ అనే అంశాలపై పరిశోధన చేసి డాక్యుమెంట్ సమర్పించారు. ఆమెను ప్రిన్సిపల్ మధుసూదన్ వర్మ, అధ్యాపకులు అభినందించారు

డిప్యుటేషన్‌పై సర్వేయర్ల బదిలీ

కలువాయి(సైదాపురం): మండలంలోని కలువాయి-1, కలువాయి-2 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సర్వేయర్లు వెంకటేష్, సునీల్ కుమార్‌ను రెవెన్యూ నుంచి డిప్యుటేషన్‌పై ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. మండలంలో సమిత్వా-2020 ప్రాజెక్టుకు సంబంధించి ఇద్దరికీ డిప్యుటేషన్‌పై బాధ్యతలు కేటాయించినట్లు అధికారులు తెలియజేశారు.

11 నుంచి టెండర్ల స్వీకరణ

వాకాడు: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని కోట బస్టాండు ఆవరణలో పలు దుకాణాల ఏర్పాటుకు ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు టెండర్లకు దరఖాస్తులు స్వీకరిస్తామని డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కోట బస్టాండులో దాదాపు 11 దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాలకు తన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..


కళకళలాడుతున్న మాగాణి భూములు


వరినాట్లు వేస్తున్న మహిళలు

"దేవుడా.. ఈఏడు పంటలను కాపాడు..నీ సల్లని చూపుతో బాగా పండేలా చూడు.." అంటూ వ్యవసాయ కూలీలు జానపద పాటలతో హుషారుగా వరినాట్లు వేస్తున్నారు. తెలుగుగంగ బ్రాంచి కెనాల్స్ పుణ్యామా అన్ని మండలంలోని దేవరవేమూరు, తుమ్మలతలుపూరు, దేవరవేమూరు, పొక్కందల, పరసారెడ్డిపల్లి గ్రామాల్లోని చెరువులకు నీరు చేరడంతో రైతులు పంటలసాగుకు సిద్ధమయ్యారు. ఈ ఎడగారు సీజన్‌లో వరి పంట అయితేనే నమ్మకంగా చేతికి వస్తుందనే ధీమాతో వరి సాగుకు రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పొలాలు దుక్కులు చేసిన రైతులు వరినాట్లు వేగవంతంగా వేస్తున్నారు. పంటల సాగుతో మాగాణి భూములన్నీ పచ్చదనంతో కనిపిస్తున్నాయి. - సైదాపురం

కనుల పండువగా శాంతి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో స్వయంభుగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, పంచామృతాభిషేక పూజలు పురోహితులు వేదమంత్రోచ్ఛరణతో జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి కల్యాణం నిర్వహించారు. కుజదోషం ఉన్న వారు హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కిశోర బాలికలకు అవగాహన


గోనుపల్లిలో కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాజ్యలక్ష్మి

ఓజిలి: మండలంలోని కొండవల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిశోర బాలికలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, పాలు, గుడ్లును ఎక్కువగా తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చన్నారు. కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపండి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, విజయ తెలిపారు. ఓజిలి గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులు చేర్పించాలని, వారికి పౌష్టికాహారంతో పాటు బొమ్మలతో కూడిన విద్యను బోధిస్తున్నట్లు తెలియజేశారు.

కలువాయి(సైదాపురం)లో..

కలువాయి(సైదాపురం): మండలంలోని కుల్లూరు ఎస్టీకాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం కిశోర వికాసంపై అవగాహన కల్పించారు.

రాపూరులో..

రాపూరు: కిశోర బాలికలకు బాల్యవివాహాలు, పరిసరాల శుభ్రత, బాలికల సంరక్షణా చట్టాలపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోర వికాసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునందన మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించి, బాల్యవివాహాల రహిత గ్రామాలను తీర్చిదిద్దాలని కోరారు. అలాగే ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తహసీల్దార్ నరసింహం, ఎంపీడీఓ భవాని పాల్గొన్నారు. అలాగే గోనుపల్లిలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వేపినాపిలో సౌజన్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఏడాదవుతున్నా ఇంటి స్థలాలు ఇవ్వరా ?


చిల్లకూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిల్లకూరు : పేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికీ పల్లెల్లో అయితే మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో అయితే రెండు సెంట్లు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదన్నారు. 55 ఏళ్లు దాటిన వ్యవసాయ కార్మికులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


మాట్లాడుతున్న ఎంపీడీఓ


సైదాపురం: బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీఓ సునంద అధ్యక్షతన కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు, బాలల హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ సునంద మాట్లాడుతూ 18 ఏళ్లు దాటితేనే వివాహ వయసు అని తెలియజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గోకుల బృందావనం సర్పంచ్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి శశిఇంద్రాణి, కార్యకర్త సుమతి ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది తదితరులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు వారి సౌజన్యంతో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వారు నిర్వహించిన శిబిరంలో 250 మందికి పైగా కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ట్రస్టు డైరెక్టర్ చాగణం గౌరి శంకర్, సీఈఓ సీతారామానాయుడు తెలిపారు. 70 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 64 మందిని ఉచిత కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరిని ప్రత్యేక వాహనంలో తిరుపతిలో కంటి వైద్యశాలకు తీసుకెళ్లి బుధవారం కంటి శస్త్రచికిత్స అనంతరం గురువారం నాయుడుపేటలో వదిలి పెట్టడం జరుగుతుందని కంటి వైద్య నిపుణులు డాక్టర్ భవానీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కనమర్ల పూడి సుబ్రమణి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోటా వెంకటేశ్వర్లు, మల్లి, ట్రస్టు ఏటగల్లా కృష్ణ, పీఆర్‌ఓ కృష్ణ, అరవింద్ నేత్రలయ వైద్యులు, సిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపునీరు


రోడ్డుపై ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షపు నీరు

చిట్టమూరు: మండలంలోని ఈశ్వరవాక పంచాయతీ మన్నెమాల గ్రామంలో రోడ్డుపై మోకాళ్లోతు గుంతల్లో నిలిచిన నీటితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై పడిన గుంతల్లో నీరు నిలిచిపోయింది. దీంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డు మరీ దారుణంగా ఉందని వాపోతున్నారు. మరి కొద్ది రోజుల్లో స్కూళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ ముందు రోడ్డుపై నీరు నిలిచి ఉండడం ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చి, మురుగునీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించండి

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని 23వ వార్డు పరిధిలో బేరిపేట నుంచి రజక కాలనీ వరకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులు, నాయకులతో కలిసి మంగళవారం పర్యటించారు. గుడ్‌మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని వాటిని నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ ఏఈ చంద్ర, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డేసి..ఇరువైపులా వదిలేసి..!


గ్రావెల్స్ బరమ్స్ లేకుండా వదిలేసిన సీసీ రోడ్డు

చిట్టమూరు : మండల పరిధిలోని తాడిమేడు దళితవాడలో ఎన్ఆర్‌ఈజీఎస్ సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డు అయితే వేశారు గానీ ఇరువైపులా గ్రావెల్‌తో బరమ్స్ వేయకుండా వదిలేశారు. ఈ రోడ్ల నిర్మాణం గుత్తేదారులకు లబ్ధి చేకూర్చడానికే వేశారా అనేలా వేశారు. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలకపోవడంతో వాహన చోదకులు అదుపు తప్పి కింద పడితే అంతే సంగతులు. సీసీ రోడ్లు వేసే సమయంలో కనీసం ఒక్కసారైనా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారం రోడ్లు వేసి.. ఆగమేఘాలపై బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నారు. కానీ పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.

రూ.10 లక్షల విలువ చేసే పరికరాల వితరణ


ఐటీఐ కళాశాలకు కంప్యూటర్ పరికరాలు అందజేసిన ఆస్ట్రో టెక్ స్టీల్ కంపెనీ బృందం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు ఐటీఐ కళాశాలకు మంగళవారం శ్రీసిటీ ఆధ్వర్యంలో ఆస్ట్రో టెక్ స్టీల్ కంపెనీ వారు రూ.10 లక్షల విలువ చేసే కంప్యూటర్ పరికరాలు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం 15 కుర్చీలు, ఒక వాటర్ డిస్పెన్సరీ కూలింగ్, రెండు హెచ్‌పీ లేజర్ ప్రింటర్స్, 15 డెల్ కంపెనీ కంప్యూటర్లతో పాటు ఇంటీరియల్ రెనోవేషన్ పరికరాలను దాతలు కళాశాల ప్రిన్సిపల్ రమాదేవికి అందజేశారు. ఆస్ట్రో టెక్ స్టీల్ కంపెనీ వారిని ఐటీఐ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపింది. కళాశాలకు ఇంటర్నెట్, వైఫై ఇవ్వాలని ప్రిన్సిపల్ దాతలను కోరారు. కంపెనీ ఎండీ అరుణ్‌మిరండా, జేఎండీ జైసన్‌జోసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

48 మద్యం సీసాలు స్వాధీనం

దొరవారిసత్రం: సత్రం మండలంలోని పూలతోట గ్రామ పరిధిలో బెల్టు దుకాణంపై స్థానిక పోలీసులు సోమవారం రాత్రి ఆకస్మిగా దాడులు నిర్వహించగా 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు పట్టుబడి మద్యం సీసాలను సీజ్ చేసినట్టు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్త్రీనిధి రుణాల రికవరీపై సమీక్ష


మాట్లాడుతున్న ఏజీఎం కామక్షయ్య

కలువాయి(సైదాపురం) : స్త్రీనిధి రుణాలను త్వరితగతిన రికవరీ చేయాలని స్త్రీనిధి ఏజీఎం కామక్షయ్య తెలిపారు. కలువాయిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం సంఘబంధ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా మహిళల పిల్లలకు ఎన్టీఆర్ విద్యాసంకల్పంతో కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందించనున్నట్లు తెలిపారు. రూ.35 పైసలు వడ్డీతో సెర్ప్ పరిధిలో స్త్రీనిధి బ్యాంకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవి, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

వైభవం.. గ్రామోత్సవం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని కుల్లూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఅచ్యుత స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వేతనాలు పెంచాలని నిరసన


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి రూరల్ : ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36, ఆర్డీ నంబర్ 1615 ప్రకారం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో పోరాటాలు కొనసాగించనున్నట్లు తెలియజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కరణలు వంటివి జీఓలో జమ చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ పథకాలు మున్సిపల్ కార్మికులకు వర్తింప అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ వల్లూరు పెంచలయ్య, కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, రమణయ్య, గోపాల్, హరిబాబు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మోహినీ అవతారంలో వేంకటేశ్వరుడు


స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని రాజవీధిలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారికి మోహినీ అలంకరణ చేశారు. సాయంత్రం గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా విజయదుర్గ, ఉప పీఠాధిపతులు కోట సునీల్, సోమినేని పెంచలనాయుడు, వసంతమ్మ, ప్రసాద్ తదితరులు వ్యవహరించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకంఠి రామోహన్‌రావు, ఈఓ రవికృష్ణ పర్యవేక్షించారు.

చెన్నైకి గంజాయి తరలిస్తూ వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఒడిశా నుంచి చెన్నైకి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని గూడూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నెల్లూరు డీఎస్పీ జి.మురళీధర్ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఒడిశా, విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లలో మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి రైల్వే పోలీస్‌లు ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం కావలి, నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్లు, ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దేవదాస్ టాటా నగర్ - ఎర్నాకులం రైల్లో ప్రయాణిస్తూ గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగి హడావుడి బయటకు వెళ్తుండగా ఇన్‌చార్జి రైల్వే ఎస్సై వై.చెన్నకేశవరావు అదుపులోకి తీసుకున్నారు. దాస్ బ్యాగ్‌లో మూడు కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నై పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేశామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్సై జి.మాలకొండయ్య, ఆర్పీఎఫ్ ఏఎస్సై సీకేఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మకు పూలంగి సేవ


అలంకరణలో గంగమ్మ

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన గంగమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం పూలంగి సేవ నిర్వహించారు. ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేకంగా అభిషేకాలు, చందన అలంకరణ చేశారు. అనంతరం ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

నిరసనకు తరలిన మహిళా నేతలు


నెల్లూరులో జరిగిన నిరసనలో పాల్గొన్న సూళ్లూరుపేట మహిళా విభాగం నేతలు

నాయుడుపేటటౌన్ : కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా కేంద్రం నెల్లూరులో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి మహిళలు మంగళవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నాయుడుపేట మండలం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ ఖురుగొండ ధనలక్ష్మి సారథ్యంలో, వైస్ ఎంపీపీ అత్తికాయల కృష్ణవేణితో పాటు పార్టీలోని పలు విభాగాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో వెళ్లి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న బుజ్జమ్మ

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని భూపయ్య కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారు ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. వివరాలు.. భూపయ్య కాలనీకి చెందిన బుజ్జమ్మ రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి తిరుపతి వెళ్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుజ్జమ్మను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పరికరాల వితరణ

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని కాంపాళెం సమీపంలో ఉన్న ఐటీఐ కళాశాలకు ఆస్ట్రోటెక్ స్టీల్స్ సౌజన్యంతో సీఎస్ఆర్ నిధులచే పరికరాలను వితరణ చేశారు. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రణమిరండా, డైరెక్టర్ జైసన్ జోసెఫ్ యంత్రాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పారిశ్రామిక రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు ఐటీఐ కళాశాలకు పరికరాలను వితరణ చేసినట్లు చెప్పారు. యువత వీటిని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ప్రిన్సిపల్ ఉమా రాణి, ట్రైనింగ్ అధికారి రామారావు, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.